ప్రజారోగ్య పరిరక్షణే సీఎం జగన్ ధ్యేయం

చింతపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో గిరిజనులు ఆరోగ్యవంతులుగా ఉంటారని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. మండలకేంద్రం చింతపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ధ్యేయమన్నారు. సురక్ష శిబిరంలో గిరిజనులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్,వైద్యులు పాల్గొన్నారు.

ఎటపాక: పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన వస్తోంది. రెండవ విడత నిర్వహిస్తున్న శిబిరాల్లో పలువురు చికిత్సలు చేయించుకుంటున్నారు. నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం రాయనపేట పంచాయతీ కేఎస్ పురంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి సచివాలయం పరిధిలోని 200 మంది హాజరయ్యారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బొర్రా అలివేలు,ఎంపీటీసీ వెంకటరమణ,వైద్యులు శశికళ, సాయికిషోర్,ప్రత్యూష్, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : నెల్లిపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 254 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో నెల్లిపూడి సర్పంచ్ పాతర రమణమ్మ, ఎంపీటీసీ కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పిడతమామిడి, గంగవరం పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు సేవలందించారు.


నెల్లిపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అరకులోయ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని చొంపి పంచాయతీ కొత్తవలసలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో 152 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించి, సకాలంలో చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భద్రయ్య, పావని, నాయక్, ఏఎన్ఎంలు పాపయమ్మ, గంగమ్మ, వైద్యసిబ్బంది చిన్న, చిన్నబాబు, రమణ, నీలాంబర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జగనన్న ఆరోగ్య సురక్షతో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని సర్పంచ్ వి.రమేష్ తెలిపారు. మండలంలోని సుజనపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 206 మందికి వైద్య సేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మరింతగా వైద్య సేవలను చేరువ చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిలగాడ వైద్యాధికారి రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, ప్రత్యేక వైద్యాధికారులు సందీప్,అనిష్, కిలగాడ వైద్య,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చింతపల్లిలో వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య


వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న వైద్యాధికారి ఉదయ్‌ప్రశాంత్


కేఎస్ పురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి


సుజనపేటలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

ఈరోజు

రాజేంద్రపాలేనికి ఎమ్మెల్యే, సమన్వయకర్తల రాక

కొయ్యూరు: మండల కేంద్రం రాజేంద్రపాలెంలో బుధవారం పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, పాడేరు సమన్వయకర్త ఎం.విశ్వేశ్వరరాజు పర్యటించనున్నట్టు ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు మంగళవారం తెలిపారు. రాజేంద్రపాలెం అల్లూరి స్మారక కళామందిరం వద్ద నిర్వహించే కార్యక్రమంలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కును డ్వాక్రా సభ్యులకు వారు అందజేయనున్నట్టు చెప్పారు.

సామాజిక తనిఖీలపై ప్రజా వేదిక

కొయ్యూరు: ఉపాధిహామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలపై బుధవారం మండల స్థాయిలో ప్రజా వేదికను నిర్వహించనున్నట్టు ఏపీవో రాజు మంగళవారం తెలిపారు. సిబ్బంది, కూలీలు హాజరుకావాలని కోరారు.

మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

వై.రామవరం: మండలపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎల్.యాదగిరేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

బూత్‌ల వద్ద భద్రతపై సూచనలు


పనసలపాలెంలో పోలింగు బూత్‌ను పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: మండలంలోని చామగడ్డ, పనసలపాలెం గ్రామాల్లో పోలింగు బూత్‌లను అడ్డతీగల సీఐ వై.రాంబాబు మంగళవారం పరిశీలించారు. పోలింగు సమయంలో అక్కడ నిర్వహించాల్సిన భద్రతా ఏర్పాట్లపై స్థానిక ఎస్ఐ ఎం. సంతోష్‌కుమార్‌కు సూచనలు ఇచ్చారు.

పాఠశాలలకు చేరుకున్న టెన్త్ స్టడీ మెటీరియల్

రాజవొమ్మంగి : మండలంలోని అన్ని పాఠశాలలకు పదవ తరగతి స్టడీ మెటీరియల్ చేరుకున్నట్టు స్థానిక ఎంఈవో సూరయ్యరెడ్డి తెలిపారు. మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఐదు గిరిజనసంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలు, ఒక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 385 మంది విద్యార్థినీవిద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్టు ఎంఈవో తెలిపారు.

ఘనంగా రాజులుబాబు పండగ


పాండవుల విగ్రహాల వద్ద పూజలో పాల్గొన్న సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: మండల కేంద్రం గూడెంకొత్తవీధిలో మంగళవారం అడవి రాజులబాబు పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాండవుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి ఉపాధ్యాయులు గణేశ్వరరావు, కామేశ్వరరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంతా కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఇటువంటి సంప్రదాయాలను అంతా గౌరవించాలని ఈసందర్భంగా సీఐ తెలిపారు.

'ఆసరా' కార్యక్రమాన్ని వీక్షించిన అక్కాచెల్లెళ్లు


ప్రత్యక్ష ప్రసారాన్ని రాజవొమ్మంగి సచివాలయంలో వీక్షిస్తున్న మహిళలు

రాజవొమ్మంగి: వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా సభ్యులకు నాల్గవ దఫా రుణమాఫీ చేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక పొదుపు సంఘాల మహిళలు మంగళవారం టీవీల్లో తిలకించారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి-2 సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మహిళాఅధ్యక్షురాలు శాంతకుమారి, రాజవొమ్మంగి, అప్పలరాజుపేట, వయ్యేడు తదితర గ్రామాలకు చెందిన మహిళలు వందలాదిగా పాల్గొన్నారు.

యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న మల్లిబాబు, (మధ్యలో వ్యక్తి)

కొయ్యూరు: గిరిజన ప్రాంతాల్లో యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు కొటా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్, గిరిజన యువ ప్రగతి సంక్షేమ సొసైటీల మండల చైర్ పర్సన్ ఈర్లె మల్లిబాబు తెలిపారు. రాజేంద్రపాలెం అతిథిగృహంలో మంగళవారం సర్పంచ్ పీటా సింహాచలం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థల తరఫున కొత్తగా పాఠశాలలు, ఆస్పత్రిని నిర్మించి, వాటిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. సర్పంచ్ సింహాచలం మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

జి.మాడుగుల: విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఈ నెల 27న నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి కోరారు. స్థానిక విలేకర్లతో మంగళవారం ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా వైఎస్సార్ పార్టీ శ్రేణులను సన్నాహం చేసేందుకు ఈ సభ నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న చైర్మన్లు, డైరెక్టర్లు,జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొనాలని కోరారు.

సొవ్వలో భారీ ర్యాలీ

డుంబ్రిగుడ: విశాఖ జిల్లా భీమిలో ఈ నెల 27న జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభను విజయవంతం చేయాలని కోరుతూ డుంబ్రిగుడ మండలం సొవ్వ పంచాయతీ కేంద్రంలో మంగళవారం సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్పంచ్ సొయిత, వైఎస్సార్ సీపీ నాయకులు అశోక్‌కుమార్, రాంప్రసాద్, గురునాయుడు, అప్పాలరాజు పాల్గొన్నారు.


సొవ్వ పంచాయతీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మారేడుమిల్లి : మండలంలోని ఆకుమామిడికోట గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బొడ్లంక గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి బైక్‌పై మారేడుమిల్లి వస్తుండగా ఆకుమామిడికోట గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయిన సమయంలో బైక్ అదుపు తప్పింది. దీంతో కిందపడిన ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని రంపచోడవరం ఆస్పత్రికి తరలించారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ


క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు పలు క్రీడలకు సంబంధించిన కిట్లను ఆమె మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, మండల పరిషత్ ఏవో ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డేడ లిల్లి, బొడ్డేడ బుజ్జి, కొయ్య శేషు పాల్గొన్నారు.

నేతాజీకి ఘనంగా నివాళులు


అరకులోయలో నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

అరకులోయ రూరల్: సుభాష్‌చంద్రబోస్ అందరికీ ఆదర్శప్రాయుడని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. నేతాజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజు, అధ్యాపకులు కొండబాబు, నాగబాబు, అనితకుమారి, గణేష్, రాజు, కామేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి : స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సుభాష్ చంద్ర బోస్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేతాజీ ఆశయల సాధనకు కృషి చేయాలన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రామతులసి

గంగవరం : పశువుల బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైస్‌ఎంపీపీ రామతులసి తెలిపారు. మంగళవారం మొల్లేరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును వైస్ ఎంపీపీ ప్రారంభించి, మాట్లాడారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని కోరారు. నెల్లిపూడి జూనియర్ వెటర్నరీ అధికారి పశుబీమా గురించి వివరించారు. మొల్లేరు లైవ్ స్టాక్ అసిస్టెంట్ బి. అనంతలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శీనయ్య

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంర్ధక శాఖ వైద్యాధికారి శీనయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మూగ జీవాలు ప్రమాదవశాత్తు మరణిస్తే వాటి యజమానులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని తెలిపారు.

నేటి నుంచి విధుల్లోకి అంగన్‌వాడీ వర్కర్లు



కొయ్యూరు, రాజవొమ్మంగిల్లో సీడీపీవోలకు జాయినింగ్ రిపోర్టులు అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కొయ్యూరు/రాజవొమ్మంగి: రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించడంతో అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె విరమించారు. బుధవారం నుంచి వీరు విధుల్లో చేరనున్నారు. ఈ సందర్భంగా కొయ్యూరులో సీడీపీవో విజయకుమారి, సూపర్‌వైజర్లకు మంగళవారం జాయినింగ్ రిపోర్టర్ అందజేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమించి విధుల్లో చేరుతున్నట్టు యూనియన్ నేతలు ముత్యాలమ్మ, అచ్చియమ్మ తెలిపారు. సీపీఎం నేత సూరిబాబు పాల్గొన్నారు. రాజవొమ్మంగి ప్రాజెక్టు పరిధిలోని 77 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 76 మంది ఆయాలు, మరో 17 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నుంచి విధుల్లో చేరుతున్నట్టు సీడీపీవో దేవమణి తెలిపారు. మంగళవారం జాయినింగ్ రిపోర్టు ఇచ్చారని ఆమె చెప్పారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అడ్డతీగల: రవాణాశాఖ నిబంధనలను వాహనాదారులు తప్పనిసరిగా పాటించాలని రంపచోడవరం ఆర్టీవో ఎస్.రాజేష్‌కుమార్ తెలిపారు. రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా అడ్డతీగలలో మంగళవారం ప్రైవేటు వాహన యజమానులు, డ్రైవర్లకు సూచనలు చేశారు. ఫోన్ నంబర్లకు ఆధార్‌కార్డు లింక్‌చేసుకుని లైసెన్స్‌కి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా అన్ని పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు.

పలు చోట్ల తనిఖీలు

వేటమామిడి జంక్షన్‌తో పాటు అడ్డతీగల శివారున పెట్రోల్ బంక్ వద్ద ఆర్టీవో రాజేష్‌కుమార్ వాహనాల పత్రాలు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.


వాహనదారులకు సూచనలిస్తున్న రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

నక్కపల్లి : జాతీయర ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపటాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీలకు నిర్వాహకులుగా తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్ ఆచార్యులు వ్యవహరించారన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యాన్ని ప్రతి పౌరుడు గుర్తించాలన్నారు. దృఢ ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పడానికి ఎటువంటి నాయకులను ఎన్నుకోవాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. తెలుగు పండిట్ ఆచార్యులు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద దేశాల్లో భారత్ ఒకటని, ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని శాసించే శక్తిమంతుడు ఓటరు అన్నారు. అంతటి విలువైనది కావడంతో ప్రతి పౌరుడు ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలన్నారు.

ఈ పోటీల్లో పెద బోదిగల్లం ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ సిరాజ్‌నిషా ప్రథమ స్థానంలోను , నక్కపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి నరసింహాచార్యులు ద్వితీయ స్థానంలోను నిలిచారన్నారు. వక్తృత్వ పోటీల్లో స్థానిక హైస్కూలు విద్యార్థి షర్మిల ప్రథమ స్థానం, నరసింహాచార్యులు ద్వితీయ స్థానంలోను నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాణి లలిత, ఎన్నికల డీటీ తాతాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ బంగారు పాప, ఉపాధ్యాయులు సత్యవతి, టి.వి.రమణ పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో నరేష్

పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి తీర్థం నేడు

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు

దేవరాపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పెదనందిపల్లి విజయ వెంకట సత్యనారాయణ స్వామి తీర్థ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. బుధవారం ఇక్కడ ఘనంగా తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం తర్వాత అంతటి విశిష్టత కలిగిన పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి తీర్థ మహోత్సవాన్ని రెండు రోజులు పాటు పెదనందిపల్లి, చిననందిపల్లి, మారేపల్లి, చేనులపాలెం, తారువ, తిమిరాం, ఎం. అలమండ తదితర గ్రామాల ప్రజలు జరుపుకుంటారు. ఏటా మాదిరిగా తొలిరోజు బుధవారం అతి వైభవంగా నిర్వహించే తీర్థానికి ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొండపై ఆలయం వద్దకు మెట్ల మార్గం గుండా చేరుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ డి. నాగేంద్ర ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక ఆంక్షలు విధించడంతోపాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


పెదనందిపల్లి విజయ వేంకట సత్యనారాయణ స్వామి


మాడుగుల: మోదకొండమ్మను దర్శించుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరమణ

ఒమ్మలిలో మోదకొండమ్మ తీర్థం...

మాడుగుల: ఒమ్మలిలో మోదకొండమ్మ తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పసుపు కుంకుమతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, మహిళా కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతోనే ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ పంటలతోనే ఆరోగ్యం సాధ్యమని ఆ శాఖ మండల ఇన్‌చార్జి నిర్మల అన్నారు. ప్రకృతి వ్యసాయశాఖ ఆధ్వర్యంలో సేంద్రియ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల స్టాల్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రదర్శించారు. ఈ స్టాల్‌ను సందర్శించిన పలువురికి రసాయన సాగు, ప్రకృతి సాగు ద్వారా పండించే పంటలు, వాటి వినియోగంలో ఆరోగ్య సమస్యలపై యూనిట్ ఇన్‌చార్జి మోదినాయుడు అవగాహన కల్పించారు. ఆ శాఖ సిబ్బంది జ్యోతి, నాగకాంతం, సుజాత, భావన తదితరులు సందర్శకుల సందేహాలు నివృత్తి చేశారు.